నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, శనివారం 10 ఫిబ్రవరి 2024 | JAGTIAL

## అత్యాధునిక సౌకర్యాలు



రాయిచందని సింధ్ డెవలపర్స్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోనే మొట్టమొదటిసారిగా అత్యాధునిక ప్రమాణాలతో అపార్ట్‌మెంట్లు, విల్లాలు నిర్మిస్తున్నాం. మా నిర్మాణాలు ప్రస్తుతం నగరంలో మూడు ప్రాంతాల్లో విస్తరించాయి. మల్కాపూర్‌లో ఆరున్నర ఎకరాల్లో 73 విల్లాలు, అందులో జీ ప్లస్–1 63, జీ ప్లస్–2లో 10 నిర్మాణాలు జరుగుతున్నాయి. కస్టమర్లకు స్విమ్మింగ్ పూల్, క్లబ్ హౌస్, జిమ్, పార్టీ హాల్, లైబ్రరీ తదితర వసతులతో నిర్మించి ఇస్తున్నాం. ఇవి శాతవాహన యూనివర్సిటీ, స్కూళ్లు, కాలేజీలకు అత్యంత సమీపంలో ఉన్నాయి. ఈ విల్లాలను కస్టమర్లకు ఏప్రిల్‌లో అందిస్తాం. అలాగే నగునూర్ ప్రతిమ హాస్పిటల్ ఎదుట సిల్వర్ స్ప్రింగ్ పేరిట మూడెకరాల్లో 41 విల్లాలను నిర్మిస్తున్నాం. అందులో స్విమ్మింగ్ పూల్, క్లబ్ హౌస్, జిమ్, పార్టీ హాల్, ఆట స్థలం, గార్డెన్ ఏర్పాటు చేస్తున్నాం. అలకాపురి కాలనీలో నూతన డీమార్ట్ ఎదుట శారద హోమ్స్ అపార్ట్‌మెంట్లో 25 ఫ్లాట్స్ (2 బీహెచ్‌కే) నిర్మాణం పూర్తయింది. ఈ అపార్ట్‌మెంట్ కరీంనగర్ టూ హైదరాబాద్ హైవే, ఐటీ టవర్, సిరిసిల్ల బైపాస్‌రోడ్‌కు అత్యంత సమీపంలో ఉంటుంది. మా సంస్థ నిర్మిస్తున్న మూడు ప్రాజెక్టులు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) అనుమతులతో చేపట్టాం. అలాగే, మా సంస్థ వేములవాడ నంది విగ్రహం నుంచి సిరిసిల్ల వెళ్లే రోడ్డులో 12 ఎకరాల సువిశాలమైన కమర్షియల్, రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్స్ అందుబాటులో ఉన్నాయి.

**- వినీత్ మోత్వాని, రాయిచందని సింధ్ డెవలపర్స్**



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, వేదికపై నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, నగర మేయర్ సునీల్‌రావు, కేడీసీసీబీ ఉపాధ్యక్షుడు పింగళి రమేశ్, నమస్తే తెలంగాణ అడ్వర్టైజింగ్ జీఎం సురేందర్‌రావు, నమస్తే తెలంగాణ కరీంనగర్ బీఎం, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు

# గ్రోత్ సెంటర్ కరీంనగర్

- కేసీఆర్ పాలనలో వేగంగా పట్టణీకరణ
- నిర్మాణ రంగానికి పుష్కలమైన వసతులు
- రాబోయే రోజుల్లో నగరంలో మరింత అభివృద్ధి
- రియల్ వ్యాపారులు ప్రణాళికతో నిర్మాణాలు చేపట్టాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కార్పొరేషన్, ఫిబ్రవరి 9: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవసాయ రంగం తర్వాత పట్టణీకరణ వేగవంతమైందని, కరీంనగర్ ఉత్తర తెలంగాణలో ఒక గ్రోత్ సెంటర్‌గా మారిందని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో నిర్మాణ రంగానికి పుష్కలమైన వసతులు ఉన్నాయని, పక్కనే ఎల్ఎండీ రిజర్వాయర్ ఉందని, ఆపైన మిడ్ మానేరు కూడా ఉందని, భవిష్యత్‌లో నగరానికి నీటికి ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. రానున్న రోజుల్లో కరీంనగర్ మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రాపర్టీ షోను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మేయర్ సునీల్‌రావుతో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. త్వరలోనే భారత్ చాలా గొప్ప దేశంగా మారబోతున్నదని, తాను పదేండ్లు ఎంపీగా పనిచేసిన అనుభవంతో ఈ మాట చెబుతున్నానని పేర్కొన్నారు. దేశంలో సగానికి పైగా ఉన్న యువత రానున్న రోజుల్లో తమ ఉద్యోగాలరీత్యా, ఇతర ఉపాధి అవకాశాల బాటలో ఆయా ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరచుకుంటారని, ఈ క్రమంలో రియల్ రంగానికి భవిష్యత్తు అత్యధికంగా ఉంటుందన్నారు. రియల్ వ్యాపారులందరూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని విశాలమైన రోడ్లు, పార్కులు, ఇతర అన్ని సౌకర్యాలు ఉండేలా పక్కా ప్రణాళికలతో నూతన భవనాలు నిర్మించాలని, వెంచర్లు అలాగే ఉండాలని సూచించారు. అర్హత లేకున్నా కరీంనగర్‌కు కేసీఆర్ కృషితోనే స్మార్ట్‌సిటీని సాధించుకున్నామని, ఇప్పటి వరకు ₹560 కోట్లతో అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. ఉద్యమ సమయంలోనే మానకొండూరుకు నేరుగా బ్రిడ్జి ఉండాలని ఆలోచన చేశామని, దానికి అనుగుణంగానే ఎవరూ అడుగక ముందే ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సహకారంతో కేబుల్ బ్రిడ్జి నిర్మించినట్లు చెప్పారు. ఇంకా కరీంనగర్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ ఉపాధ్యక్షుడు పింగళి రమేశ్, నమస్తే తెలంగాణ అడ్వర్టైజింగ్ జీఎం సురేందర్‌రావు, ఏజీఎం రాజిరెడ్డి, నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచి మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు, ఎడిషన్ ఇన్‌చార్జిలు ఐ సుభాష్, వీ సంపతి, యాడ్స్ మేనేజర్ రేణ మల్లయ్య, సర్క్యులేషన్ మేనేజర్ పురుషోత్తం, ప్రొడక్షన్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, టెక్నికల్ ఇన్‌చార్జి రామకృష్ణ, స్టోర్ ఇన్‌చార్జి రవి, స్టాఫర్ దొంత వెంకటస్వామి, నమస్తే తెలంగాణ రిపోర్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ

దేశంలోనే నివాసాల కొనుగోళ్లు, అమ్మకాలు, రియల్ వ్యాపారంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉన్నది. ఈ పదేళ్ల కాలంలో అత్యధికంగా అభివృద్ధి సాధించింది. జిల్లాల పునర్విభజన అయినప్పటికీ అన్ని ప్రాంతాల్లోనూ నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నది. కేడీసీసీ నుంచి కూడా సుమారుగా ₹350 కోట్ల మేరకు నిర్మాణ రంగంలో రుణాలు ఇచ్చాం. నిర్మాణ రంగంలో ఉన్న అన్ని అవకాశాలను తెలుసుకునే విధంగా ప్రాపర్టీ షోలు నిర్వహించడం అభినందనీయం.

**- కొండూరి రవీందర్‌రావు, నాఫ్స్‌కాబ్ చైర్మన్**

### నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి

కరీంనగర్‌లో గత పదేళ్ల కాలంలో నిర్మాణ రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నది. కొత్తగా జిల్లాల ఏర్పాటు తర్వాత కరీంనగర్‌లో నిర్మాణ రంగానికి ఎక్కడా ఇబ్బందులు రాలేదు. అంచనాలను తలకిందులు చేసేలా రెట్టింపుస్థాయిలో నిర్మాణ రంగం ముందుకు సాగుతున్నది. ముఖ్యంగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సహకారంతో బీఆర్ఎస్ సర్కారు భారీగా నిధులు ఇవ్వడంతో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి చెందింది. నగరం కూడా రోజురోజుకూ విస్తరిస్తున్నది. అభివృద్ధిలో దూసుకెళ్తున్నది.

**- యాదగిరి సునీల్‌రావు, నగర మేయర్**



కేడీసీసీబీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి



ప్రాపర్టీ షోకు తరలివచ్చిన సందర్శకులు

మొదటి రోజు ఫుల్ రెస్పాన్స్

# ప్రాపర్టీ షో.. అదరహో

## 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో నిర్వహణ

- రెండు రోజుల ఎక్స్‌పోను ప్రారంభించిన మాజీ ఎంపీ వినోద్
- వందలాది మంది సందర్శకుల రాక
- కిటకిటలాడిన రెవెన్యూ గార్డెన్

**కరీంనగర్ జిల్లాకేంద్రంలో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షో అదిరింది. ఈ ఎక్స్‌పో రెండు రోజులపాటు కొనసాగనుండగా, మొదటి రోజు శుక్రవారం విశేష స్పందన లభించింది. కలెక్టరేట్ ఎదుట ఉన్న రెవెన్యూ గార్డెన్ వందలాది మందితో కిటకిటలాడింది. హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలతోపాటు బ్యాంకులు పాల్గొనగా, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్టాళ్ల వద్దకు వెళ్లి వెంచర్లు, ఇండ్లు, అపార్ట్‌మెంట్లు బ్యాంకు రుణాలకు సంబంధించిన సమాచారం తెలుసుకున్నారు.**



సారథి ఇన్‌ఫ్రా స్టాల్‌లో సందర్శకులకు వివరిస్తూ..

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 9 : 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉన్న రెవెన్యూ గార్డెన్ వేదికగా రెండు రోజుల ప్రాపర్టీ షో ఏర్పాటు చేశారు. మొదటి రోజు శుక్రవారం ఉదయం 10 గంటలకు మాజీ ఎంపీ వినోద్ కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై ఈ ఎక్స్‌పోను ప్రారంభించారు. అనంతరం స్టాళ్లను ఓపెన్ చేయడంతోపాటు ఆయా సంస్థల వివరాలను తెలుసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన పలు ప్రముఖ సంస్థలతోపాటు జిల్లాకు చెందిన వివిధ రియల్ సంస్థలు, బిల్డర్స్‌తో పాటు నిర్మాణ రంగానికి సంబంధించిన సోలార్ సంస్థలు, సిమెంట్, వుడ్‌కు సంబంధించిన సంస్థలు, నిర్మాణాలకు రుణాలు అందించే బ్యాంకులు, వివిధ ఫైనాన్స్ సంస్థలు ఈ ప్రాపర్టీ షోలో పాల్గొనగా, షోను తిలకించేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి స్టాల్‌కు వెళ్లి వెంచర్లు, ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆయా సంస్థల్లో కొనుగోలు చేస్తే అందించే సదుపాయాలు, ఆధునిక సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు. వీటితో పాటు బ్యాంకుల ద్వారా అందుతున్న రుణాలు, వాటికి సమర్పించాల్సిన వివిధ డాక్యుమెంట్ల వివరాలను సేకరించారు. కొందరు కుటుంబసభ్యులతో కలిసి వచ్చి ఆసక్తిగా పరిశీలించారు. నిర్మాణ రంగానికి అనుబంధంగా ఉన్న ఇతర సంస్థల స్టాళ్ల నుంచి ఆయా పనులకు అయ్యే వ్యయ వివరాలను తెలుసుకున్నారు. పెద్ద సంఖ్యలో సందర్శకులు రావడంతో స్టాల్స్ అన్నీ కిక్కిరిసిపోగా, రెవెన్యూ గార్డెన్ ప్రాంతమంతా సందడిగా మారింది. నగరానికి చెందిన ప్రముఖులు, నాయకులు, రియల్ ఏజెంట్లు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో వచ్చారు. మొదటి రోజు ప్రతి రెండు గంటలకోసారి లక్కీడ్రా ద్వారా బహుమతులు అందించారు. కాగా, మొదటి రోజు షోకు మంచి స్పందన వచ్చిందని, రెండో రోజు శనివారం కూడా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న కరీంనగర్‌లో ఇలాంటి ప్రాపర్టీ షో నిర్వహించడం నిజంగా చాలా సంతోషకరమైన విషయమని, ఇండ్లు, అపార్టుమెంట్లు, ప్లాట్లు, గృహ రుణాల గురించి ఒకే చోట తెలుసుకునే అవకాశం ఏర్పడిందని సందర్శకులు చెబుతున్నారు. ఇలాంటి వేదికలు అప్పుడప్పుడు ఏర్పాటు చేయాలని కోరారు.

### మంచి ఆదరణ ఉన్నది



నమస్తే తెలంగాణ ప్రాపర్టీ షోకు మంచి ఆదరణ ఉన్నది. అందులో ఉస్మానీ కన్‌స్ట్రక్షన్స్ స్టాల్ ద్వారా మేం అందిస్తున్న సేవలను వివరిస్తున్నాం. మేం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రజల అభిరుచులకు అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నాం. నగర శివార్లలో అనువైన స్థలాలు, విశాలమైన రోడ్లతో నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రజల నుంచి కూడా మంచి ఆదరణ ఉన్నది.

**- సాద్ ఉస్మాని, సివిల్ ఇంజినీర్ (ఉస్మానీ కన్‌స్ట్రక్షన్స్)**

### ఆసక్తి చూపుతున్నారు



నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మా ప్రాజెక్టుల వివరాలను అందరికీ తెలుపుతున్నాం. సందర్శకులు మా నాణ్యమైన ప్రాజెక్టుల గురించి తెలుసుకునేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

**- మహేందర్, వేకా యూపీసీ స్మార్ట్ విండోస్ సొల్యూషన్స్**

### మంచి గుర్తింపు ఉన్నది



ఎన్నో సంవత్సరాలుగా గృహ నిర్మాణ రగంలోని మహా సిమెంట్‌కు మంచి గుర్తింపు ఉన్నది. ప్రాపర్టీ షోకు వచ్చిన సందర్శకులకు మా మహా సిమెంట్ అందిస్తున్న సేవలను వివరిస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేకు మా కృతజ్ఞతలు.

**- నాగార్జున, సీనియర్ సేల్స్ మేనేజర్ (మహా సిమెంట్)**

### ప్రజల వద్దకు చేరేలా ప్రాపర్టీషో



నమస్తే తెలంగాణ ఆధ్వర్యంలో ప్రజల వద్దకు చేరేలా ప్రాపర్టీ షో నిర్వహించడం చాలా మంచి విషయం. దీని ద్వారా ఒక్కరోజే 40 నుంచి 50 మందికి సేవలందించాం. లోన్లు, డిపాజిట్లకు సంబంధించి అనుమానాలు నివృత్తి చేశాం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యామనే భావన వచ్చింది. ఇలాంటి కార్యక్రమాన్ని మరిన్ని నిర్వహించినా మేం ముందుండి సహకారం అందిస్తాం.

**- కృష్ణదియో సింగ్, చీఫ్ మేనేజర్ (బ్యాంక్ ఆఫ్ బరోడా)**

### అందరికీ అందుబాటులో



ప్రాపర్టీషోలో మా సారథి ఇన్‌ఫ్రా స్టాల్ ఏర్పాటు చేశాం. ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర జిల్లాలలో ఉన్న పలు స్థలాలకు సంబంధించిన వివరాలను అందరికీ అందుబాటులో ఉంచాం. మా ప్రతి ప్రాజెక్టు వంద శాతం డీటీసీపీ లేఅవుట్‌తో అందుబాటులో ఉంచాం. సందర్శకుల తాకిడి బాగా ఉన్నది. ఈ షో ద్వారా ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ఎవరైనా ముందుకొస్తే.. 50 శాతం డబ్బు కట్టినా నిబంధనలతో రిజిస్ట్రేషన్లు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

**- సంతోష్, ఎండీ (సారథి ఇన్‌ఫ్రా)**

### అద్భుతంగా ఎడ్‌వెన్సా సెంచరీ నిర్మాణాలు



కరీంనగర్ నడిబొడ్డున వావిలాలపల్లిలో ఎడ్‌వెన్సా సెంచరీ ఈపీసీ నిర్మాణాలు చేపట్టాం. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అద్భుతంగా నిర్మిస్తున్నాం. క్లబ్ హౌస్, విత్ ఫర్నిచర్, ఫంక్షన్‌హాల్, జిమ్, యోగా హాల్, ఇండోర్ స్పోర్ట్స్, గెస్ట్‌రూమ్స్, మల్టీపర్పస్ హాల్, కార్ పార్కింగ్, డ్రైవర్ రెస్ట్ రూమ్స్, విశాలమైన మినీపార్క్, అందరికీ అనుగుణంగా ఉండే వాకింగ్ ట్రాక్.. ఇలా అన్నీ సౌకర్యాలను అందుబాటులో ఉంచుతున్నాం. సందర్శకుల నుంచి మంచి ఆదరణ ఉన్నది.

**- వెంకటపతి శర్మ, ఎడ్‌వెన్సా ఈపీసీ నిర్వాహకుడు**

### నిర్మాణ సంస్థలు అందుబాటులో ఉన్నయ్



ప్రాపర్టీ షో ద్వారా చాలా నగరం ఎంత అభివృద్ధి చెందబోతుందో తెలుస్తుంది. ఇక్కడ చాలా గృహ నిర్మాణ సంస్థలతోపాటు, ఇంటి నిర్మాణంలో అవసమరమయ్యే సిమెంట్, యూపీవీసీ, ప్లైవుడ్, సోలార్ ఇలా చాలా సంస్థలు అందుబాటులో ఉన్నాయి. ఒకసారి ఇక్కడికి వస్తే ఇంటి నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయి.

**- శైలజ, సందర్శకురాలు**

### ప్రాపర్టీషో చాలా బాగుంది



నగర వాసులకు అవగాహన కల్పించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా మంచి నిర్ణయం. కొత్తగా జిల్లాకు వస్తున్న సంస్థల ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నా. ఇలాంటి కార్యక్రమాల ద్వారా కొత్తగా ఇల్లు కట్టుకునాలనుకునేవారికి, కొనుగోలు చేయాలనుకునేవారికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రాపర్టీ షో ఎంతో బాగుంది.

**- గాండ్ల చంద్రశేఖర్, పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు**



బ్యాంక్ ఆఫ్ బరోడా స్టాల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

### ఉత్పత్తుల గురించి వివరిస్తున్నాం



నగరవాసులకు కరెంటు కష్టాలు లేకుండా గృహోపకరణాల కోసం అనువైన సోలార్ ఉత్పత్తుల గురించి వివరిస్తున్నాం. అందరికీ అందుబాటులో చాలా వరకు సోలార్ ఉత్పత్తులు మా వద్ద ఉన్నాయి. ప్రతి ఇంటికీ అవసరమైన మేరకు పూర్తి స్థాయి సోలార్ సిస్టం, ప్రభుత్వ సబ్సిడీతో అందుబాటులో ఉంచాం. వాటి గురించి సందర్శకులకు వివరిస్తున్నాం. సందర్శకుల నుంచి స్పందన బాగున్నది.

**- ప్రశాంత్ గడ్డం, ఎండీ (సోని సోలార్ పవర్)**

### అన్నీ ఒక్కదగ్గరే ఉన్నయ్



నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాపర్టీ షోను చూడటానికి వచ్చాను. ఇక్కడ ప్రతి గంటకూ నిర్వహిస్తున్న కూపన్‌లో నేను బహుమతి గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ అనేక రకాల నిర్మాణ సంస్థలు, అన్ని హంగులతో వస్తున్న అపార్ట్‌మెంట్లు, వాటికి కావాల్సిన సోలార్ సిస్టం, యూపీవీసీ స్మార్ట్ విండోస్ ఇలా అన్నీ ఒక్క దగ్గరే అందుబాటులో ఉన్నయ్.

**- ఎం సతీశ్, ఫ్రీ కూపన్ విజేత**



రాయిచందని స్టాల్‌ను ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్, కొండూరి రవీందర్‌రావు



కె.కె. సోలార్ స్టాల్ ను ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్



ఫ్రీ గిఫ్ట్‌ను అందిస్తున్న టీఎన్జీవోల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, పక్కన జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్‌రావు, నాయకులు కోట రామస్వామి, సుద్దాల రాజయ్య, ప్రధానోపాధ్యాయుల సంఘం నేత రాజభాను, తదితరులు



పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

# మా జీతాలేవి?

- రెణ్నెళ్ల నుంచి రాక గడ్డుకాలం ఎల్లదీస్తున్నం
- కదంతొక్కిన ఆశ కార్యకర్తలు
- పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 9 : రెండు నెలల నుంచి జీతాలు రాక గడ్డుకాలం ఎల్లదీస్తున్నామని ఆశ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పెద్దపల్లిలో కదం తొక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలని నిరసనకు దిగారు. జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసిన కార్యకర్తలు, అధిక పనిభారం చేయలేమని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని శుక్రవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు అణవేన స్వరూప మాట్లాడారు. గృహలక్ష్మి, అభయహస్తం అమలు, అర్హుల జాబితా కోసం తమపై అధిక పని భారం మోపుతున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ మధ్య జీతాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మాలో నిరుపేదలకు ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర నాయకుడు కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, సువర్ణ, స్వప్న,పద్మ, జ్యోతి, రజిత, మంజుల, రాజేశ్వరీ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

### పనిభారం తగ్గించాలి



కాంగ్రెస్ సర్కారు మాపై మోయలేని భారం వేస్తున్నది. రెగ్యులర్ విధులతోపాటు గృహలక్ష్మి, అభయహస్తం పథకాల అమలులో భాగంగా అర్హుల వివరాల నమోదు బాధ్యతలు మాకే అప్పజెప్పింది. అధిక పని భారం మోయలేం. ప్రతి నెల ఒకటో తేదీన మాత్రమే జీతాలు ఇవ్వాలి. హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. మా చదువుకు సాధ్యంకాని పనులు అప్పగించద్దని మా విజ్ఞప్తి.

**- అణవేన స్వరూప, ఆశ కార్యకర్తల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు**

# లంచం కేసులో వీఆర్వోకు నాలుగేళ్ల జైలు

కోర్టుచౌరస్తా (కరీంనగర్) ఫిబ్రవరి 9: వ్యవసాయ భూమి పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కిన నేరంలో వీఆర్వోకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా ప్రత్యేక ఏసీబీ కోర్టు జడ్జి కుమార్ వివేక్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం పీచుపల్లికి చెందిన సామ ప్రభాకర్‌రెడ్డి తన భూమికి సంబంధించి కొత్త పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్ కోసం దరఖాస్తు చేసుకొని 2011 మార్చి 1న వీఆర్వో శ్రీనివాస్‌ను సంప్రదించగా రూ. 10 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధితుడు రూ.5 వేలు ఇచ్చేందుకు ఒప్పుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శ్రీనివాస్‌కు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసును విచారించిన వివేక్ నిందితుడు శ్రీనివాస్‌కు నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

# మానేరు తీరం.. భక్తజన సంద్రం



పుష్య బహుళ అమావాస్య జాతరతో శుక్రవారం సిరిసిల్ల మానేరు తీరం భక్తజనసంద్రంగా మారింది. వాగును ఆనుకొని ఉన్న గంగాభవానీ, మడేలేశ్వరస్వామి, రామప్ప ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అనంతరం జాతరలో సందడిగా గడిపారు.

**- ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల**